సాక్షి మంచిర్యాల

మంగళవారం । 13 । మే । 2025



కాలగర్భంలోకి మరో బొగ్గు గని

ఆర్కే–6 భూగర్భ గనిలో బొగ్గు నిల్వలు అడుగంటాయి. జూలై నుంచి బొగ్గు ఉత్పత్తి బంద్ చేయనున్నారు. దీంతో బదిలీలపై ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో▸



కాలువకు మరమ్మతు కరువు

కోటపల్లి మండలం తుతుంగ వాగు ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ మరమ్మతుకు నోచుకోవడం లేదు. గత ఏడాది వర్షాలకు ధ్వంసం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.0 /29.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పదోన్నతితో మరింత బాధ్యతలు



సీపీ అంబర్ కిషోర్ ఝూతో ఏఎస్సైలు

మంచిర్యాలక్రైం: పదోన్నతితో విధుల్లో మరింత బాధ్యతలు పెరుగుతాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తూ ఏఎస్సైగా పదోన్నతి పొందిన వారిని సోమవారం సీపీ కార్యాలయంలో అభినందించారు. పదోన్నతి చిహ్నం అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితోపాటు బాధ్యత పెరుగుతుందని, క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, గౌరవం పెంచే విధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ షురూ

- మంచిర్యాలలో 38 రిజిస్ట్రేషన్లు
- రూ.9.28 లక్షలు ఆదాయం



పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు

మంచిర్యాలటౌన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పదిహేను నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా అమలు చేస్తున్న స్లాట్‌బుకింగ్ విధానాన్ని సోమవారం మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు ప్రారంభించారు. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ ప్రియంక ఉండగా.. మరో సబ్ రిజిస్ట్రార్ రాజిరెడ్డిని నియమించగా విధుల్లో చేరారు. ఇద్దరు కలిసి రోజుకు 96 రిజిస్ట్రేషన్‌లు చేయాల్సి ఉంటుంది. ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి రోజు 38స్లాట్లు బుక్ చేసుకోగా 15నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి మరో పదిహేను నిమిషాల్లో మ్యుటేషన్ కాపీలు, దస్తావేజులు అందజేశారు. రూ.9,28,330 ఆదాయం సమకూరింది. ఈ విధానంతో సులభతరంగా, వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందనే అవగాహన వస్తే పూర్తి స్లాట్లు బుక్ అవుతాయని జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు తెలిపారు.

గూడెంలో పౌర్ణమి జాతర



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. 303 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

డీపీఆర్వోగా కృష్ణమూర్తి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి(డీపీఆర్వో)గా ఎం.కృష్ణమూర్తి నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పౌర సంబంధాల కమిషనర్ వినయ్‌క్రిష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన జే.శారద విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఏప్రిల్ 25న రాష్ట్ర కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. ఆమె స్థానంలో ఇంచార్జి డీపీఆర్వోగా డీపీఆర్వో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రవితేజ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీపీఆర్వో కృష్ణమూర్తిని మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. శారదను నిర్మల్ జిల్లా ఏడీపీఆర్వోగా కేటాయించారు. ఈ నెల 15లోగా విధుల్లో చేరాలని పేర్కొన్నారు.

జిల్లాకు వర్ష సూచన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నేటి నుంచి ఈ నెల 16 వరకు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. మంగళవారం ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొన్నారు. 14, 15, 16న ఉరుములు, మెరుపులు, 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు.

దారివ్వని అనుమతి



కోటపల్లి మండలం బొప్పారం, అలుగామ మధ్య రోడ్డు



నక్కలపల్లి, బ్రహ్మణపల్లి మధ్య రోడ్డు

- మారుమూల పల్లె రోడ్లకు ఇబ్బందులు
- అటవీ అనుమతులు లేక జాప్యం
- ఏటా వానాకాలంలో తప్పని తిప్పలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అటవీ సమీప గ్రామాలకు ఏళ్లుగా రహదారి కష్టాలు తీరడం లేదు. వర్షాకాలంలో రవాణాకు గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ పరిధిలో నిర్మిస్తున్న పలు పనులకు అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని పనులకు మొదటి దశ అనుమతి వరకు, కొన్నింటికి రెండో దశలో ఉన్నాయి. ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో రోడ్డు నిర్మాణాలకు మంజూరు వస్తున్నాయి. ఆ రోడ్డు నిర్మాణంలో భాగంగా అటవీ, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, సున్నిత ప్రాంతాలు ఉన్నచోట్ల రాష్ట్ర స్థాయిలో కాకుండా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. జాతీయ రహదారులు, నాలుగు వరుసల దారులకు పల్లె రోడ్ల కంటే త్వరిత గతిన అనుమతులు వచ్చాయి. మొదటి, రెండో దశ, అటవీ పరిహారం, వన్యప్రాణుల కోసం ప్రత్యేకంగా అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయడంతో అనుమతులు వస్తున్నాయి. కానీ రాష్ట్ర పరిధి పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ పనుల్లో మాత్రం అందుకు భిన్నంగా జాప్యం జరుగుతోంది.

ఏళ్లుగా అదే తీరు..

2017లో మంజూరైన రోడ్డు పనులు ఇప్పటికీ ప్రారంభం కావడం లేదు. అటవీ, వన్యప్రాణుల ప్రాంతాలు సున్నితమైన జోన్లుగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలకు నిబంధనలు కఠినంగా ఉంటాయి. అటవీ సమీప ప్రాంతాల నుంచి రహదారుల నిర్మాణంతో అటవీ సంపదతోపాటు జీవ జాతులకు ముప్పు కారణంగా అభ్యంతరాలు వస్తుంటాయి. దీంతో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ నుంచి జిల్లాలో అనేక మారుమూల ప్రాంతాల దారులకు మోక్షం కలుగడం లేదు. ఇప్పటికీ జాతీయ రహదారిగా ఉన్న ఎన్‌హెచ్–63కి సైతం అటవీ అనుమతుల్లో జాప్యం జరిగింది. జోడువాగు వద్ద వంతెన నిర్మాణం గత కొన్నేళ్లుగా ముందుకు సాగడం లేదు. ఇటీవల విస్తరణ కోసం కేంద్ర స్థాయిలో అనుమతులు రావడంతో త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. శ్రీరాంపూర్ బస్టాండ్ నుంచి జీఎం ఆఫీసు వరకు ఇందారం బీట్ పరిధిలో అటవీ అనుమతులు లేక రోడ్డు మధ్యలోనే నిలిచిపోయింది. నిత్యం ప్రమాదాలు జరిగే ఈ బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదం పొంచి ఉంది.

స్థానికులకు తిప్పలే..

అటవీ ప్రాంత గ్రామీణులు మండల, జిల్లా కేంద్రాలకు వర్షాకాలంలో రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల, కాసిపేట, జన్నారం మండలాల్లో ఇంకా పూర్తిస్థాయిలో అనుమతులు రావడం లేదు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న చోట్ల ప్రత్యేకంగా నిధులు కేటాయించి, రోడ్లు మంజూరు చేసినప్పటికీ పనులు సాగడం లేదు.

- వేమనపల్లి మండలం లక్ష్మీపూర్ నుంచి బద్దంపల్లి మధ్య రెండు చోట్ల వంతెనలు, మరో చోట అటవీ అనుమతి రెండో దశ అనుమతి రావాల్సి ఉంది.
- వేమనపల్లి మండలం చామనపల్లి రోడ్డుకు రెండో దశ అనుమతి కోసం నివేదిక పంపారు. పనులకోసం అనుమతి రావాల్సి ఉంది.
- ఇదే మండలంలో చామన్‌పల్లి నుంచి కుశ్నపల్లి రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతుల రెండో దశ కోసం ప్రతిపాదనలు పంపించారు.
- నెన్నెల మండలంలో నెన్నెల నుంచి వయా కోనంపేట, కుశ్నపల్లి రోడ్‌కు రెండో దశ అనుమతులు సైతం పూర్తయ్యాయి. పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

నిబంధనల మేరకే ఇస్తున్నాం..

జిల్లాలో అటవీ అనుమతులపై మొదటి, రెండో దశల్లో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ మేరకు అనుమతులు ఇస్తున్నాం.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీ అధికారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



వివిధ రకాల పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న భీమిని మండలం చిన్నగుడిపేట వాసులు

పింఛన్ ఇప్పించరూ..!

- ప్రజావాణిలో సమస్యల వెల్లువ
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్
- పెండింగ్‌లో ఉంచరాదని ఆదేశాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ''పుట్టుకతోనే నా మనుమడి కాళ్లు చచ్చుబడిపోయాయి. తొమ్మిదేళ్లు అవుతుంది.. ఏళ్ల తరబడి పింఛన్ కోసం తిరుగుతున్న బాంచెన్. నా భర్త చనిపోయి ఏళ్లు గడుస్తున్నా పింఛన్ రావడం లేదు.. దివ్యాంగుల పింఛన్ రావడం లేదు..'' అంటూ భీమిని మండలం చిన్నగుడిపేటకు చెందిన మహిళలు, చిన్నారులు, వృద్ధులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు దరఖాస్తు సమర్పించి గోడు వెళ్లబోసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో తమకు అన్యాయం జరిగిందని, భూములు ఆక్రమించుకున్నారని, అక్రమ పట్టాలు రద్దు చేయాలని, భూ పరిహారం మంజూరు చేయాలని, ఉపాధి కల్పించాలని ఇలా అనేక సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కలెక్టర్ కుమార్ దీపక్ అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

- తాండూర్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కాసిపాక లక్ష్మి తన పేరిట ఇందిరమ్మ ఇల్లు జాబితాలో ఉందని, నిర్మాణానికి అనుమతించాలని కోరింది.
- దండేపల్లి మండలం పాతమామిడిపల్లి గ్రామానికి చెందిన ఆరేపల్లి సత్తయ్య తన తండ్రి పేరిట గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణించినందున కొందరు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని, తన తల్లి పేరిట పట్టా చేయాలని కోరాడు.
- హాజీపూర్ మండలం గుడిపేట, ముల్కల్ల, వేంపల్లి గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసినందున ఉపాధి కల్పించాలని ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు అర్జీ సమర్పించారు.
- బెల్లంపల్లి పెద్దనపల్లి వార్డుకు చెందిన కుసనపల్లి అన్నపూర్ణ తాను ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నానని, కూలీ పని చేసే తన భర్తకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నట్లుగా చూపించారని, విచారణ జరిపి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరింది.

రెండు కాళ్లు పనిచేయవు..



నా మనుమడు ఎగ్గ వినోద్(9) పుట్టుకతోనే దివ్యాంగుడు. రెండు కాళ్లు పనిచేయవు. నాలుగో తరగతి చదువుతున్నాడు. ఏడాదిన్నర క్రితం 30శాతం వైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చింద్రు. కాళ్లు చచ్చుబడి పోయి భూమి మీద నుంచి లేచి నిల్చోలేడు. తన పనులు, ఇతర ఏ పనీ చేయలేడు. ఇటువంటి వాళ్లకు పింఛన్ రాకుంటే ఎట్లా. పింఛన్ ఇప్పించాలి.

– ఎగ్గ వినోద్, నానమ్మ పోషమల్లక్క, చిన్నగుడిపేట, భీమిని

కంటి సమస్య..



కంటి సమస్య, మరుగుజ్జుతనంతో ఏళ్ల తరబడి బాధ పడుతున్న. నా చూపు పని చేయక ఏ పనీ చేసుకోలేక ఇబ్బంది పడుతున్న. నాకు పింఛన్ మంజూరు చేయాలి.

– ఎం.యేసన్న, గూడెం, దండేపల్లి

ఉన్నోళ్లకే ఇళ్లు



ఇందరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నం సర్వే చేసింద్రు. గడ్డి గుడిసెలు, పెంకలతో ఎప్పుడో కట్టుకున్నయి శిథిలావస్థలో ఉన్నా యి. కొందరికి మొత్తానికే ఇళ్లు లేవు. మా కన్నెపెల్లిలో 30 ఇళ్లు మంజూరయ్యాయి. ఉన్నోళ్లు, లీడర్లకే ఇళ్లు మంజూరు చేసింద్రు. అర్హులైన మాకు అన్యాయం చేసింద్రు. అధికారులు మళ్లీ సర్వే చేసి నిరుపేదలమైన మాకు ఇళ్లు ఇవ్వాలి.

– కమల, శ్రీదేవి, లక్ష్మి, పద్మ, పుష్ప, లావణ్య, కన్నెపెల్లి

భూమి ఆక్రమించుకున్నాడు



మంచిర్యాల గర్మిల్ల శివారులోని సర్వే నంబరు 290లో 2006లో మేమంతా 21 ప్లాట్లు కొనుగోలు చేశాం. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన వ్యక్తి 20ఏళ్లుగా మేము అనుభవిస్తున్న భూములను 2025లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా చూపుతూ ప్లాట్లకు కంచె వేసి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీనిపై విచారణ చేపట్టి మాకు న్యాయం చేయాలి. – బాధితులు

చెట్లు నరికేశారు..



భీమారం మండలం వెల్లంపల్లి, కాజిపెల్లి శివారు సర్వే నంబర్ 94/1లో మామిడి తోట, వరి సాగు చేసుకుంటున్న. చింత చెట్లు పెంచుతున్నా.. నా భూమిలో ఉన్న 82 చింత చెట్లు(8 సంవత్సరాల) వయసు ఉన్నవి. రెండేళ్లుగా చింతకాయలు దిగుబడి వస్తున్నవి. విద్యుత్ లైన్ వేస్తున్నామని నెన్నెల ఏఈ, కాంట్రాక్టర్ కలిసి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పూర్తిగా నరికి వేయించారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలి. – ముడిపెల్లి మహేష్, రైతు, ఆవుడం

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, ఎమ్మెల్సీ విఠల్

- ప్రతీ గ్రామంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

బెల్లంపల్లిరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ చూపిన బాట అనుసరణీయమని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని చాకేపల్లి గ్రామంలో అంబేడ్కర్ స్నేహ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు హేయమైన చర్యగా మండిపడ్డారు. ప్రతీ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలు, ఇంటింటా చిత్రపటాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేతకాని భవన్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. అంతకముందు బెల్లంపల్లి మండలంలో రూ.17.77 కోట్లతో నిర్మించిన 10 బీటీ రోడ్లు, రూ.2.45 కోట్లతో బెల్లంపల్లి మున్సిపాలిటీ నుంచి చాకేపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు మరమ్మతు పనుల శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ ముడిమడుగుల శంకర్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా , డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్, డీసీపీ భాస్కర్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, కాంగ్రెస్ పార్టీ, అంబేడ్కర్ సంఘం నాయకులు రాంచందర్, మహేందర్, మల్లేష్, రమేష్, రవీందర్‌రెడ్డి, కేవీ.ప్రతాప్, శంకర్, మురళీధర్ రావు, స్వామి, మల్లయ్య, సంతోష్ పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్కకు వినతుల వెల్లువెత్తాయి. ప్రజలు, వివిధ విభాగాల సిబ్బంది తమ సమస్యల కోసం వినతిపత్రాలు అందజేశారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి



షెట్‌పల్లిలో పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మండలంలోని షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, పౌనూర్, శివ్వారం, వేలాల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్నరకం వడ్లకు మద్దతు ధరతోపాటు రూ.500అదనపు బోనస్ అందిస్తామని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఇందారం గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి స్థలాన్ని పరిశీలించారు.

అటవీ అధికారుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అటవీ అధికారులు స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి మాట్లాడుతూ ఈ నెల 14వరకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల రేంజ్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్, కాగజ్‌నగర్ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ ఎడ్ల లక్ష్మణ్, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సునిత, ఫీల్డ్ సూపర్‌వైజర్లు, వాచర్‌లు, డ్రైవర్లు రక్తదానం చేశారు. శ్రావణితోపాటు రక్తదాతలను రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్యప్రాణులకు హాని

జైపూర్: అడవులు, ప్లాంటేషన్లలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థపదార్థాలతో వన్యప్రాణులకు హాని కలుగుతుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి తెలిపారు. అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం మండలంలోని కాన్కూర్ సమీపంలో నీలగిరి ప్లాంటేషన్‌లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

వైద్యసేవల్లో నర్సులే కీలకం



జీజీహెచ్, ఎంసీహెచ్ నర్సింగ్ ఆఫీసర్లను సన్మానిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: రోగులకు వైద్య సేవలు అందించడంలో నర్సుల పాత్ర కీలకమని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో సోమవారం లయన్స్‌క్లబ్ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో పనిచేస్తున్న 20 మంది నర్సులను శాలువాతో ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీమన్నారాయణ, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మేరి సుకన్య, ఉమ మహేశ్వరి, ఇన్నమ్మ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో నర్సులు బి.రజిత, బి.లావణ్య, ఈ.శిరీషలను శాలువాతో రెడ్‌క్రాస్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ చందూరి మహేందర్, ఎంసీ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, యెడ్ల కిషన్, సభ్యులు పాల్గొన్నారు.

టీచర్లు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య సూచించారు. ఈ నెల 13నుంచి 17వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నస్పూర్‌లో ఆంగ్లం, స్పెషల్ ఎడ్యుకేషన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తీగలపహాడ్‌లో సాంఘిక శాస్త్రం, కేజీబీవీ మంచిర్యాలలో ఎస్జీటీ, డీఆర్పీ, ఎమ్మార్పీలకు 512 మంది టీచర్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయి, జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

ఫార్మాసిస్టులు ఇకపై ఫార్మసీ ఆఫీసర్లు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా మారుస్తూ జీవో 71ను విడుదల చేసిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని ఫార్మాసిస్టులు డీఎంహెచ్‌వోను కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో 25 మంది ఫార్మాసిస్టులు ఇకపై ఫార్మసి ఆఫీసర్లుగా కొనసాగుతారని తెలిపారు. అటెండెన్స్ రిజిష్టరులో మార్పడంతోపాటు ఐడెంటిటీ కార్డుల్లోనూ మార్పులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, డాక్టర్ సుధాకర్‌నాయక్, శంకర్, చంద్రయ్య, శ్రీనివాస్, బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యం కారణంగా ఒకరు ఆత్మహత్య


వినోద్ (ఫైల్)

భైంసారూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ (39) రెండేళ్లుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి వ్యవసాయం, ఇతర పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పైన ఉన్న గదిలో పడుకునేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన జగ్తాప్ అభిషేక్ (24) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల మేరకు జగ్తాప్ అభిషేక్ కొంతకాలంగా డీజే సౌండ్స్‌కు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. అందుకు యువతి నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి జగ్తాప్ సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం కోల్పోయి వృద్ధురాలు..

నర్సాపూర్(జి): మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన సట్ల భోజవ్వ (75) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయింది. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం పెద్దకుమారుడు శివయ్యతో గొడవకు దిగడంతో మందలించాడు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి భోజవ్వ ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ శివారులోని స్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించింది. మృతురాలి చిన్న కుమారుడు సట్ల పీరాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జలాలుద్దీన్ తెలిపారు.

రైలు కిందపడి ఒకరు బలవన్మరణం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత హమాలీవాడ గేటు వద్ద సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మృతుడు 5 అడుగుల ఎత్తు, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నాడని, బూడిదరంగు నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. కుడిచేతిపై జై గురుదేవ్ అని హిందీలో, టోని అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టుతో రాసి ఉందన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658596, 9618689879 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

హుండీ అపహరణ

బాసర: బాసరలోని శ్రీ కేదారేశ్వర ఆలయంలోని హుండీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఘటన స్థలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి హుండీని ఎత్తుకెళ్లినట్లు ఆశ్రమ నిర్వాహకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీ కేదారేశ్వరి మాత అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని కిరాణా దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని రంగ గోవర్ధన్ దుకాణంలో 129 కిలోల నల్లబెల్లం, 5 కిలోల పటిక, పెర్కగూడలో రజిత వద్ద 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఇంతియాజ్, సాయి ప్రసాద్, జమీర్, విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీకి యత్నం

జైపూర్: కేబుల్ చోరీకి యత్నించిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తెలిపారు. మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిలో పంపు రిపేర్ నిమిత్తం స్థానిక చెక్ పోస్ట్ ముందు ఉంచిన కేబుల్‌ను ఆదివారం రాత్రి దొంగిలించేందుకు యత్నించిన దొరగారిపల్లికి చెందిన పులి భరద్వాజ్, బడుగు ప్రశాంత్, సాతుకు మల్లేశ్‌ను పట్టుకున్నట్లుగా వారు తెలిపారు.

కాలగర్భంలోకి మరో బొగ్గు గని

- ఆర్కే–6లో అడుగంటిన నిల్వలు
- జూలై నుంచి బొగ్గు ఉత్పత్తి బంద్
- 50 ఏళ్ల చరిత్ర సమాప్తం
- బదిలీలపై ఉద్యోగుల్లో ఆందోళన



ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో కంపెనీ స్థాయిలో బహుమతి అందుకుంటున్న గని అధికారులు (ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో మరో భూగర్భ గని కాలగర్భంలో కలిసిపోనుంది. సుదీర్ఘ చరిత్ర ఉన్న శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని జూలై చివరిలో మూసివేయనున్నారు. బొగ్గు నిల్వలు అడుగంటడంతో గనిని మూసివేయాలని యజమాన్యం నిర్ణయించింది. రెండేళ్ల నుంచి ఈ గని మూసివేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చివరికి యాజమాన్యం గనిని మూసివేస్తున్నట్లు ఇటీవల అధికారికంగా ప్రకటించింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎక్కువ మంది కార్మికులు పనిచేసిన భూగర్భ గనిగా పేరుంది. 50 ఏళ్ల చరిత్ర గల ఈ గనిలో వేలాది మంది కార్మికులు పనిచేశారు. ఒకప్పుడు ఈ గనిలో బొగ్గు తీయడానికి 6ఏ సెక్షన్ గని కూడా ఉండేది. కాలక్రమేణా నిల్వలు అడుగంటి అండర్ గ్రౌండ్ మైనింగ్ విధానం ద్వారా 300 మీటర్ల లోతుల్లో ఉన్న బొగ్గు నిల్వలు తీయడం కష్టంగా మారడంతో దీన్ని మూసివేస్తున్నారు.

రికార్డుల పరంపర..

1975 ఏప్రిల్‌లో ప్రారంభమైన గని బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణలో కూడా రికార్డు సాధించింది. ఒకప్పుడు గనిలో 8 సీమ్‌ల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం 4, 5 సీమ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఒకప్పుడు 3 వేల మంది కార్మికులు పనిచేయగా ప్రస్తుతం ఆసంఖ్య 686కు చేరుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ గని 2.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. గతేడాది 1.8 లక్షల టన్నులకు గానూ 1.94 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించింది. ఎస్డీఎల్ సెక్షన్‌లో బొగ్గు ఉత్పత్తిని సాధించడంలో కంపెనీలో నంబర్ వన్‌గా మూడుసార్లు బహుమతి సాధించింది. రక్షణలో కూడా అనేక అవార్డులను సొంతం చేసుకుంది. శ్రీరాంపూర్ ఏరియాలో యూనియన్ కార్యకలాపాలు, రాజకీయ సందడి ఉన్న గనిగా పేరుంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 60 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని జూలై వరకు తీసి మూసివేస్తున్నారు. తరువాత క్లోజింగ్ మెయింటనెన్స్ కింద కొద్ది రోజుల పాటు కొనసాగుతుంది.

ఉద్యోగుల్లో ఆందోళన..

గని మూసివేస్తే తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనని ఇందులో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఇటీవల గనిపై జరిగిన స్వర్ణోత్సవాల్లో కార్మికులు ఆందోళన చెందవద్దని, వేరే ఏరియాకు బదిలీ చేయమని, ఇక్కడి ఏరియాలోనే సర్దుబాటు చేస్తామని జీఎం హామీ ఇచ్చారు. అయితే ఈ సర్దుబాటులు కూడా పూర్తి పారదర్శకంగా చేయాలని, పైరవీలకు ఆస్కారం లేకుండా సీనియారిటీ ఆధారంగా చేయాలని కోరుతున్నారు.

మెగా ఓసీపీకి అవకాశం

భవిష్యత్‌లో ఈగనిలో ఇంకా లోతుల్లో మిగిలి ఉన్న బొగ్గు నిల్వలను ఓసీపీ ద్వారా తీసే అవకాశం ఉంది. ఆర్కే న్యూటెక్ గని, దాని తరువాత ఆర్కే 5, ఆర్కే 7 గనులు మూతపడితే వాటన్నింటినీ కలిపి మెగా ఓసీపీగా చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీనికి ఇంకా నాలుగైదేళ్లు పడుతుందని వారు పేర్కొంటున్నారు.

మైసమ్మ ఆలయం ప్రత్యేకం

ఈ గనిలో ఉన్న మైసమ్మ ఆలయానికి ప్రత్యేకత ఉంది. మహిమ గల అమ్మవారుగా పేరుంది. ఏటా దసరాకు ఇక్కడ పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల కాలనీల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జమ్మిపూజలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకుంటారు. గని మూసివేసినా ఆలయాన్ని కొనసాగిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

గని ప్రారంభం	ఏప్రిల్ 1975
గుర్తించిన బొగ్గు నిల్వలు	29.08 మిలియన్ టన్నులు
తీయడానికి అనుకూలమైన నిల్వలు	14.78 మిలియన్ టన్నులు
ఇప్పటి వరకు తీసినవి	14.54 మిలియన్ టన్నులు
ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య	686
ఎస్డీఎల్ యంత్రాలు ప్రవేశపెట్టింది	జూన్ 7, 2006
మ్యాన్‌రైడింగ్ యంత్రం	ఆగస్టు 28, 2006
ప్రస్తుతం ఉన్న సీమ్‌లు	రెండు (4,5)
బొగ్గు క్వాలిటీ	జీ 9, జీ 11

జూలైలో క్లోజ్

ఆర్కే 6 గనిలో బొగ్గు నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గనిని క్లోజ్ చేస్తున్నాం. ఈ ఏడాది జూన్ మాసంలో బొగ్గు ఉత్పత్తి ఆపేస్తే, జూలై చివరి నాటికి పూర్తిగా మూసివేయనున్నారు.

– ఈ.తిరుపతి, మేనేజర్

ఉద్రిక్తతకు దారితీసిన విగ్రహ ప్రతిష్టాపన


పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ముథోల్: మండలంలోని బోరిగాంలో సోమవారం బుద్ధుని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ భూమిలో బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించడమే ఇందుకు దారి తీసింది. గ్రామంలోని హనుమాన్ విగ్రహం సమీపంలో అంబేద్కర్ సంఘం నాయకులు బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య తోపులాట జరగడంతో ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐలు, ఎస్సైలు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించేందుకు ప్రయత్నించగా వినకపోవడంతో లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా ప్రతిష్ఠించిన విగ్రహాన్ని రెవెన్యూ అధికారులు భారీ పోలీసు భద్రత మధ్య తొలగించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. రాళ్లదాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

జాతర్లలో సీఆర్పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు


అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచి సీఆర్పీఎఫ్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్న జాతర్ల గ్రామానికి చెందిన అర్క మేఘనాథ్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సీఆర్పీఎఫ్ అధికారులు పార్థివదేహాన్ని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన యువకులు జాతీయ జెండాలతో బైక్‌ర్యాలీగా జాతర్ల గ్రామానికి చేరుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యుల రోదనల మధ్య పోలీసు వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆదివాసీలు అన్నిరంగాల్లో ఎదగాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

జన్నారం: ఆదివాసీ గిరిజనులు అన్నిరంగాల్లో ఎదగాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఆదివాసీ గిరిజనులకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులకు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారనే ఉద్దేశంతో వారిని క్రియాశీలకంగా ప్రోత్సహించడానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కుమురంభీం ఆశయాలకు అనుగుణంగా ఆదివాసీ గిరిజనులు రాజకీయంగా ఎదిగి ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఏఐసీసీ జాతీయ శిక్షణ కన్వీనర్ రాహుల్‌బల్, ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య, రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

‘20న సమ్మె విజయవంతం చేయాలి’


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జట్టి శంకర్ రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కే.విశ్వనాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, దీనివలన కార్మిక వర్గం నిర్వీర్యం కానుందన్నారు. కార్మిక సంఘాల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. దీని ప్రభావం వల్ల భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగులు ఉండరని, కాంట్రాక్టు కార్మికుల సైతం శ్రమదోపిడీకి గురవుతారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచి సెక్రటరీ షేక్ బాజీసైదా, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

చుక్కా రామయ్య పాఠశాలలో సావర్‌ఖేడా విద్యార్థులకు చోటు


విశ్వనాథ్


గీతా


అక్షిత


సిద్ధార్థ


తుశార్

కెరమెరి: మండలంలోని సావర్‌ఖేడా పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని చుక్కా రామయ్య పాఠశాలలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కడేర్ల రంగయ్య తెలిపారు. ఆరోతరగతిలో ప్రవేశానికి ఈ నెల 5న పరీక్ష నిర్వహించగా ఆదివారం రాత్రి ఫలితాలు వెలువడ్డాయి. 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా విశ్వనాథ్, గీత, అక్షిత, సిద్ధార్థ, తుశార్ సీటు దక్కించుకున్నారు. సదరు విద్యార్థులకు ఇంజనీరింగ్ వరకు ఉచితంగా విద్యాబోధన చేస్తారని ఆయన పేర్కొన్నారు.

విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

జైపూర్: పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో సరిహద్దుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల దృష్ట్యా ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేలా పోలీస్, సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్టీపీపీలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్‌సర్కార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో సీఐఎస్ఎఫ్, ఫైర్, పోలీస్ సిబ్బంది ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, వైద్యాధికారి రవీందర్, రక్షణాధికారి పులి సురేశ్, డీజీఎంలు అజ్మీర తుకారాం, అసిస్టెంట్ కమాండెంట్ సుధేశ్ జాఖర్, సీఐఎస్ఎఫ్, పోలీస్, సింగరేణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి కేసులో సోమవారం వేర్వేరు చోట్ల ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బాలాజీనగర్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన ఖలీమొద్దీన్ అలియాస్ ఖల్లు పోలీసులను గమనించి పారిపోతుండగా పట్టుకున్నారు. అతన్ని తనిఖీ చేయగా 500 గ్రాముల గంజాయి లభించింది. కేఆర్కే కాలనీలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరోచోట ఐదుగురు అరెస్టు

మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీస్ ఏరియా ప్రాంతంలో గంజాయి విక్రయించేందుకు ప్యాకింగ్ చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిలో సంజయ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ముషారఫ్, బొక్కల్‌గూడకు చెందిన అబ్దుల్ ఫజల్, మరో బాలుడు, భుక్తాపూర్ కాలనీకి చెందిన ఎండీ ఈర్షద్, రిక్షా కాలనీకి చెందిన బాలుడు ఉన్నారు. వారి వద్ద కిలో గంజాయి లభ్యమైంది. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మరొకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గత నెల 28న ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ వద్ద భుక్తాపూర్ కాలనీకి చెందిన షేక్ ఇర్ఫాన్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద 5 గ్రాముల గంజాయి లభించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా వివరించారు.

వీధికుక్కల దాడిలో 6 మేక పిల్లలు మృతి

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలో వీధికుక్కలు దాడి చేయడంతో గోపీచంద్‌కు చెందిన 6 మేకపిల్లలు మృతి చెందాయి. రోజు మాదిరిగా నే సోమవారం మేక పిల్లలను ఇంట్లో ఉన్న పాకలో వదిలేసి మిగిలిన మేకలను మేతకోసం తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి 6 పిల్లలు మృతిచెంది ఉన్నాయి. వాటిని పరిశీలించగా వీధికుక్కలుదాడి చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

కారు ఢీకొని జింక మృతి

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో భైంసా–నిర్మల్ రహదారిపై సోమవారం కారు ఢీకొన్న ఘటనలో జింక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు భైంసా నుండి నిర్మల్ వైపు వెళ్తున్న కారు తిమ్మాపూర్ గ్రామ సమీపంలో జింకను బలంగా ఢీ కొట్టడంతో మృతి చెందింది.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

బెల్లంపల్లి: పట్టణంలో ఓ పోలీసు హెడ్ కానిస్టేబుల్ పై కొందరు యువకులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.దేవయ్య సోమవారం సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి పోలీసు కంట్రోల్ రూమ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.సతీశ్ ఆదివారం స్వస్థలం బెల్లంపల్లికి వచ్చాడు. ఇద్దరు చిన్నారులను బైక్‌పై ఎక్కించుకుని అశోక్‌నగర్‌లో ఉన్న ఓ షాపు వద్ద ఆగాడు. అక్కడ చిరుతిళ్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనం తీస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో సతీశ్ కారు డ్రైవర్‌ను నిలదీయగా అతనితో పాటు కారులో ఉన్న మరో ముగ్గురు యువకులు సతీశ్‌ను కర్రతో తలపై బలంగా కొట్టడంతో గాయమైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అజీమ్, రోహిత్, సుబ్బు, రోహిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వాలీబాల్ పోటీల విజేత ‘నేరడిగొండ’


బహుమతి అందుకుంటున్న నేరడిగొండ జట్టు


రన్నరప్‌గా నిలిచిన ధర్మారావుపేట జట్టు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. లీగ్ దశలో సత్తా చాటిన మంచిర్యాల, ఆదిలాబాద్, నేరడిగొండ, ధర్మారావుపేట జట్లు సెమీస్‌కు చేరగా నేరడిగొండ, ధర్మారావుపేట జట్లు ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. ఫైనల్స్‌లో నేరడిగొండ–ధర్మారావుపేట జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి రెండు సెట్‌లలో తలో సెట్ గెలుపొందగా నిర్ణయాత్మక మూడో సెట్‌లో 15–8 పాయింట్లతో నేరడిగొండ జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు వ్యక్తిగత బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిజామాబాద్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌బాబు, వసుధ హాస్పిటల్స్ డైరెక్టర్ ప్రశాంత్, సింగరేణి రిటైర్డ్ పీఈటీ వీరారెడ్డి, కోలిండియా వాలీబాల్ క్రీడాకారుడు రామ్మూర్తి, ఆయా పార్టీల నాయకులు పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, లక్ష్మణ్, సాగర్‌రెడ్డి, నిర్వాహకులు బెల్లం శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, కుమార్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

చిత్తగూడలో కొత్త కోడళ్ల భేటింగ్


భేటింగ్‌కు హాజరైన కొత్త కోడళ్లు

నార్నూర్: మండలంలోని చిత్తగూడలో తొడసం వంశస్తుల పెర్సపెన్ (పెద్ద దేవుడు) ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొడసం వంశానికి చెందిన కొత్త కోడళ్లతో భేటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటోడ తొడసం మోతిరామ్, ఖందేవ్ ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాకెరలో సోయం వంశ కోడళ్ల భేటింగ్ నిర్వహించారు. సోయం వంశానికి చెందిన 86 మంది కోడళ్లు నూతన వస్త్రాలు ధరించి పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న మాజీ ఎంపీ సోయం బాపురావుకు గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఏవో దామోదర స్వామి

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏవో దామోదర స్వామి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం ఫకీర్‌గుట్టకు చెందిన కవిత ఉపాధి కల్పించాలని, లక్సెట్టిపేటకు చెందిన ఆత్రం అంజలి వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించాలని, బేల మండలం పీటగాంకు చెందిన శేషుబాయి బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్యామల, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల మధ్య గొడవలో ఒకరు మృతి


మడిగే తరుణ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: యువకుల మధ్య జరిగిన గొడవలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల మేరకు దేగామలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు చందు, రాము, వినోద్ దొంగతనాలు చేశారని అదే గ్రామానికి చెందిన మడిగే తరుణ్(21)ప్రచారం చేశాడు. ఇదే విషయంలో సోమవారం శంకర్‌గౌడ్ చెందిన తెల్లకల్లు బట్టిలో ఉన్న తరుణ్‌ను నిలదీశారు. మాటామాట పెరగడంతో బయటకు తీసుకువచ్చి వెనుకకు తోయడంతో తరుణ్ కిందపడి మృతి చెందాడు. మృతుని తండ్రి మడిగే సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. యువకుడి మృతితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డీఎస్పీ జీవన్‌రెడ్డి, బోథ్, ఇచ్చోడ సీఐలు వెంకటేశ్వర్‌రావ్, భీమేష్, బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది దేగామ గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

విద్యుత్ తీగలకు తగిలి బొలెరో దగ్ధం

నర్సాపూర్(జి): వరిగడ్డి కట్టలు తీసుకువస్తున్న బొలెరో వాహనం విద్యుత్ తీగలకు తగలడంతో దగ్ధమైన సంఘటన మండలంలోని కుస్లిలో చోటు చేసుకుంది. కుస్లి గ్రామానికి చెందిన రైతు భోజరాం పటేల్ పశువుల మేత కోసం బామ్ని గ్రామం నుండి వరిగడ్డి కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తీసుకువస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గడ్డితోపాటు వాహనం కాలిపోయింది. గడ్డి కట్టలు కాలుతూ పక్కనే ఉన్న రామనోల్ల గంగాధర్‌కు చెందిన బైక్‌పై పడడంతో కొంతమేర కాలిపోయింది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పినప్పటికీ అదుపులోకి రాలేదు. ఘటనలో సుమారు రూ.4 లక్షల విలువ గల వాహనం దగ్ధమైనట్లు బాధితుడు పేర్కొన్నాడు.